నాటారు.. నరికేశారు?

- విద్యుత్ లైన్‌కు అడ్డుగా ఉన్నాయని రోడ్లకిరువైపులా చెట్లను తొలగించిన సిబ్బంది
- అధికారుల సమన్వయ లోపంతో కోట్లాది రూపాయలు వృథా..

ముత్తారం: ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హరితహారంలో భాగంగా మొక్కలు నాటుతుంటే మరోవైపు అధికారులు రోడ్లకిరువైపులా ఉన్న మొక్కలను నరికివేస్తున్నారు. అధికారుల సమన్వయలోపంతో కోట్లాది రూపాయల నిధులు వృథా అవుతున్నాయన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని మచ్చుపేట నుంచి మైదంబండ వరకు ప్రధాన రహదారి వెంట ఉన్న చెట్లను విద్యుత్ లైన్‌కు అడ్డుగా ఉన్నాయని అధికారులు నరికివేశారు.

సంరక్షణకు కోట్లాది నిధులు

గోదావరిఖని నుంచి రామగిరి మండలం బేగంపేట, ముత్తారం మండలం ఓడెడ్ వరకు ఆర్‌అండ్‌బీ ప్రధాన రోడ్డుకిరువైపులా సుమారు 22 కిలోమీటర్ల మేర హరితహారం మొక్కలు నాటారు. వాటి సంరక్షణకు కోట్లాది రూపాయల నిధులు వెచ్చించారు. రామగిరి మండలం బేగంపేట నుంచి ముత్తారం వరకు రోడ్డుకిరువైపులా 11కేవీ విద్యుత్ లైన్‌ను వేశారు. రోడ్డు సెంటర్ నుంచి 33 ఫీట్ల దూరంలో మొక్కలు నాటాల్సి ఉండటంతో పాటు విద్యుత్ లైన్ ఆర్‌అండ్‌బీ నిబంధనలకు విరుద్ధంగా వేయడంతోనే ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రామగిరి మండలం బేగంపేట నుంచి ముత్తారం మండలం పోతారం వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డుకిరువైపులా వేసిన విద్యుత్ లైన్‌కు అడ్డుగా ఉన్నాయని వేల చెట్లను నరికివేశారు.


మచ్చుపేట - మైదంబండ రహదారి వెంట నరికివేసిన హరితహారం చెట్లు



అనుమతులు లేకుండానే



మచ్చుపేట నుంచి ముత్తారం వరకు రోడ్లుకిరువైపులా విరుద్ధంగా హరితహారంలో మొక్కలు నాటారు. విద్యుత్ లైన్ అడ్డుగా ఉన్నాయని చెట్లను తొలగించారు. ఎలాంటి అనుమతులు లేకుండానే వేల చెట్లను నరికివేస్తున్నారు.

– భూపెల్లి మొగిలి, అదవి శ్రీరాంపూర్

అధికారుల పర్యవేక్షణ లోపంతో..



విద్యుత్‌లైన్‌కు అడ్డుగా ఉన్నాయని రోడ్లకిరువైపులా ఉన్న చెట్లను ట్రాన్స్ కో అధికారులు నరికివేశారు. అధికారుల మధ్య సమన్వయ లోపంతోనే కోట్లాడి రూపాయల ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయి.

– వెల్మారెడ్డి సంజీవరెడ్డి, ముత్తారం







విద్యాసంస్థల్లో ముందస్తు ‘దీపావళి’

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో శనివారం ముందస్తు దీపావళి వేడుకలను జరుపుకున్నారు. కళాశాల ఆవరణలో ముగ్గులు వేసి పూలతో అలంకరించారు. దీపాలను వెలిగించి లక్ష్మీపూజ నిర్వహించారు. అనంతరం అధ్యాపకులు విద్యార్థులకు పండుగ విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



ఓవర్ లోడ్‌తో వాహనాలు.. ధ్వంసమవుతున్న రోడ్లు

సుల్తానాబాద్ : వరి ధాన్యంతో పాటు గ్రానైట్ లారీలు ఓవర్‌లోడ్ తో వెళ్తున్నా అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో రోడ్లన్నీ దెబ్బతింటున్నాయని ప్రజల ఆరోపిస్తున్నారు. రాజీవ్ రహదారి వెంబడి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడంతో అడ్డూ అదుపులేకుండా ఓవర్‌లోడ్‌తో లారీలు వెళ్తున్నాయని, వెంటనే అధికారులు నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్లపైనే పశువుల అడ్డా..



మంథని: మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రధాన వీధుల్లో రోడ్లపైకి పశువులు వస్తుండటంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. పశువులను రోడ్లపైకి రానివ్వొద్దని, మున్సిపాలిటీ అధికారులు పలుమార్లు సూచించినా పశువుల యజమానులు పట్టించుకోవడం లేదు. దీంతో గాంధీచౌక్, ప్రధాన చౌరస్తా, బతుకమ్మ చౌరస్తా, బస్టాండ్ ఏరియాతో పాటు పలు వీధుల్లో రోడ్డుపైనే పశువులు అడ్డా వేస్తుండడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రహదారులపైనే అవి కొట్లాడుకుంటుండంతో పాదచారులు బెంబేలెత్తిపోతున్నారు.

రోడ్డుపైనే వ్యాపారం..

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



సుల్తానాబాద్ : రోడ్డుపై నిలిచి ఫోన్‌లో మాట్లాడితేనే పోలీసులు దబాయించి అక్కడినుంచి పంపిస్తారు. కానీ రోడ్డుపైనే ట్రాలీ పెట్టుకొని వ్యాపారం చేస్తుండటంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని పలువురు వాహనదారులు, ఆరోపిస్తున్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీరాంపూర్ క్రాస్ రోడ్డుపైనే పలువురు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీంతో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అయినా అధికారులు సమస్యను పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి


అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కోల్‌సిటీ: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, ఓటుహక్కును అందరూ వినియోగించుకోవాలని సాంస్కృతిక సారథి కళాజాత కళాకారులు పేర్కొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అరుణశ్రీ ఆదేశాల మేరకు, శనివారం స్వీప్ కార్యక్రమంలో భాగంగా గోదావరిఖనిలోని ఎల్‌బీనగర్, రమేశ్ నగర్, కాకతీయనగర్, లెనిన్‌నగర్, విద్యానగర్, ఇందిరానగర్, సంజీవ్ నగర్, ద్వారకానగర్, ఎన్టీఆర్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఓటు హక్కుపై కళాజాత బృందం ఆట, పాటలతో వివరిస్తూ అవగాహన కల్పించారు. ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, ప్రతీఒక్కరూ తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమర్థవంతమైన నాయకుడికే ఓటువేసేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మెప్మా సీఓలు, జూనియర్ అసిస్టెంట్లు, మున్సిపల్ సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది, ఆర్పీలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు


జేసీబీతో స్థలాన్ని చదును చేయిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

రామగుండం: పట్టణంలోని జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో శనివారం కార్పొరేటర్ అఫ్రీన్ ఫాతిమా నేతృత్వంలో పారిశుధ్య పనులు చేయించారు. ఈ నెల 5వ సాక్షి దినపత్రికలో ‘హైస్కూల్‌లో ఇన్ని సమస్యలా..!’ అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. స్థానిక కార్పొరేటర్ ప్రత్యేక చొరవతో కమిషనర్ నాగేశ్వర్ సహకారంతో తరగతి గదుల పరిసరాల్లో పిచ్చి మొక్కలు తొలగించి, జేసీబీ సాయంతో ప్రాంగణాన్ని చదును చేయించారు. కూలిన ప్రహరీ ప్రాంతం నుంచి పశువులు ప్రాంగణంలోకి చేరకుండా ఉండేందుకు తొలగించిన వృక్షాలను అడ్డుగా వేశారు. నెలరోజులక్రితం జిల్లా అదనపు కలెక్టర్ అరుణశ్రీకి పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను హెచ్‌ఎం వివరించడంతో సానుకూలంగా స్పందించారు. ప్రస్తుతం ప్రాంగణాన్ని శుభ్రంచేయగా, వాష్‌రూమ్స్ తాత్కాలికంగా పునరుద్ధరణ పనులు చేయించనున్నట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు.

నిత్యావసర వస్తువులు అందజేత


నిత్యవసరాలు అందిస్తున్న సేవా సమితి సభ్యులు

జ్యోతినగర్: నిరుపేద కుటుంబానికి శ్రీ సీతారామ సేవా సమితి (వాట్సప్ గ్రూప్) అండగా నిలిచింది. కార్పొరేషన్ మూడో డివిజన్ మేడిపల్లి గ్రామానికి చెందిన రాంటెంకి ప్రభాకర్ ఇటీవల మృతిచెందాడు. పేద కుటుంబం కావడంతో ఎన్టీపీసీ అన్నపూర్ణ కాలనీలోని శ్రీసీతారామ సేవా సమితి సభ్యులు కుటుంబ సభ్యులకు శనివారం నిత్యావసర వస్తువులు అందించారు. ఇక్కడ రమాదేవి, సరిత, లక్ష్మీ, మేడీ సుభద్ర, మేడగోని స్వప్న, కొండు రమాదేవి, పిట్టల చంద్రకళ, శోభమ్మ, శ్రీనివాస్, తదితరులున్నారు.

మార్కెట్‌లో దీపావళి సందడి

- పలు రకాల ప్రమిదలు, నోము సామగ్రి కొనుగోలు చేసేందుకు ఆసక్తి


ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు

సుల్తానాబాద్ : మండలకేంద్రంలో మార్కెట్‌లో దీపావళి సందడి నెలకొంది. శనివారం పలు గ్రామాల పట్టణాల నుంచి వచ్చిన ప్రజలు నోము సామగ్రి, పూలు, పండ్లు, కూరగాయలు, కిరాణా సామగ్రి కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. దీంతో మండల కేంద్రం రద్దీగా మారింది. దీపావళి నుంచి కార్తీక మాసం వరకు నెలరోజులు దీపాలంకరణ చేయడం ఆనవాయితీ. పూజలకు ఉపయోగించే ప్రమిదలు నూనె ఒత్తులు అమ్మకాలు జోరందుకున్నాయి. వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు పేదలకు ప్రమిదలను అందజేయనున్నారు.

వివిధ ప్రాంతాల నుంచి దిగుమతి

దీపావళి లక్ష్మీ కటాక్షం కోసం పూజలను చేయడం ఆనవాయితీ. పూజలలో ఎక్కువగా దీపాలు వెలిగించి ఇంటిల్లిపాది దీపాలంకరణ చేస్తారు. స్థానికంగా ప్రమిదలు చేసినా ఎక్కువగా రాజస్థాన్, మహారాష్ట్ర నుంచి దిగుమతి చేసుకున్న పలు రకాల ప్రమిదలను కొనుగోలు చేసేందుకు ఇక్కడి కుమ్మరి కులస్తులు (శాలివాహన ప్రజలు) మక్కువ చూపుతున్నారు. టెర్రాకోట ప్రమిదలు డిజైన్లతో కూడిన వాటిని విక్రయిస్తున్నారు. అందమైన ప్రమిదలు మార్కెట్‌లో లభిస్తుండడంతో ప్రజలు వాటి వైపే మక్కువ చూపుతున్నారు. కుమ్మరి కులస్తులు గ్రామాలు, పట్టణాల్లో ఎక్కువగా ప్రమిదలు చేసేవారు. ప్రజలు వాటిని కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపకపోవడంతో స్థానిక శాలివాహన ప్రజల సైతం వివిధ ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకొని అమ్మకాలు జరుపుతూ జీవనోపాధి పొందుతున్నారు.

పలురకాల డిజైన్లు..

శాలివాహన ప్రజలు ప్రమిదలు, దీపావళి సామగ్రిని విక్రయిస్తుండగా మిగతా రోజుల్లో ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారు. మట్టి డిజైన్ల స్థానంలో పలు రకాల దేవతామూర్తుల డిజైన్లు తీసుకొచ్చి మార్కెట్లో విక్రయిస్తున్నారు. రాజస్థాన్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వచ్చిన పలు రకాల డిజైన్ల పట్ల ప్రజలు ఆకర్షితులవుతున్నారు. మట్టి దీపాలంకరణ తగ్గడంతో వివిధ ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకొని ఇక్కడ విక్రయిస్తున్నారు. రూ. 20 నుంచి 25 డజన్ అమ్మకాలు చేస్తున్నారు.


బంతిపూలు విక్రయిస్తున్న వ్యాపారులు

ఆర్థికసాయం అందజేత



జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్ గ్రామానికి చెందిన రంగు ప్రశాంత్ అనారోగ్యంతో బాధపడుతూ కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నల్ల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి బాధితుడిని పరామర్శించి రూ.10 వేలు ఆర్థికసాయంగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ నల్ల మనోహర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

నియామకం


నియామకపత్రం అందజేస్తున్న శ్రీధర్‌బాబు

పాలకుర్తి: కాంగ్రెస్ మండల కార్మిక విభాగం అధ్యక్షుడిగా ఎండీ ఫయాజ్ నియామకమయ్యారు. శనివారం నియామకపత్రాన్ని ఏఐసీసీ కార్యదర్శి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఫయాజ్‌కు అందజేశారు. ఇక్కడ డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య, మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఇబ్రహీం, మేకల అనిల్, బుర్ర పరశురాం తదితరులున్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



సుల్తానాబాద్ : మాస శివరాత్రి సందర్భంగా మండలకేంద్రంలోని శివాలయంలో శనివారం ఎస్సై విజేందర్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు పూజారులు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ సభ్యులు కొమురవెల్లి సాయిరామ్, వెంకన్న, రాజశేఖర్, సుమతి, రూప, రమేశ్ సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

యువతి వివాహానికి చేయూత


నిత్యవసరాలు అందిస్తున్న సభ్యులు

ధర్మారం: ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామానికి చెందిన పొన్నం సత్తవ్వ–మల్లేశం కుమార్తె రక్షిత వివాహానికి మండలకేంద్రానికి చెందిన ఆలయ ఫౌండేషన్ సభ్యులు క్వింటాల్ బియ్యం, నిత్యావసరాలు అందించారు. మల్లేశం ప్రమాదంలో గాయపడగా కుటుంబ పోషణ కష్టంగా మారింది. తల్లి కూలీపనికి వెళ్తోంది. ఆలయ సభ్యులు ఎలగందుల అశోక్, తాళ్లపెల్లి సురేందర్, తోడేటి మురళి మామిడిశెట్టి శ్రీనివాస్, జితేందర్‌రావు శనివారం యువతి వివాహానికి నిత్యావసర వస్తువులను ధర్మారంలో అందజేశారు. బైరి చంద్రమౌళి, కాట్నపల్లి శ్రీనివాస్ రెడ్డి, పురంశెట్టి అంజనేయులు, గుల్లకోట సర్పంచ్ పొన్న స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మడక, కనగర్తి, ఇందుర్తి, గుంపుల, గూడెం గ్రామాల్లో ఎస్సై నూతి శ్రీధర్ ఆధ్వర్యంలో శనివారం వాహనాల తనిఖీ చేశారు. ఆయా గ్రామాల మీదుగా వెళ్లే ఎలాంటి అనుమతి లేని పలు వాహనాలకు జరిమానా విధించారు. ఎన్నికల నియమావళిని ప్రతిఒక్కరూ పాటించాలన్నారు.

వెండి ఆభరణాలు, కుట్టుమెషన్లు చోరీ



సుల్తానాబాద్ రూరల్: పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై విజేందర్ తెలిపిన వివరాల ప్రకారం... బస్టాండ్ సమీపంలో ఉండే కాసారపు సత్తమ్మ కూతురు స్వప్న హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా ఇద్దరు కూతుళ్లు అమ్మమ్మ వద్ద ఉంటున్నారు. శనివారం దుస్తులు తీసుకువచ్చేందుకు సత్తమ్మ మనవరాళ్లు అద్దె ఇంటికి వెళ్లగా ఇంట్లోని వస్తువులు చిందరవందరగా ఉన్నాయి. చోరీ జరిగిందని గుర్తించి విషయాన్ని అమ్మమ్మకు తెలిపారు. 15 తులాల వెండి, గ్రాము బంగారం, రెండు కుట్టుమెషన్లు, టీవీ ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. సత్తమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.